క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత



గద్వాల అర్బన్: కేటీదొడ్డి మండలం నందిన్నెకు చెందిన నర్సింహులు, జిల్లా కేంద్రంలోని నల్ల కుంటకు చెందిన బషీరాబీ, ధరూరు మెట్టుకు చెందిన ఉమర్‌లు రోడ్డు ప్రమాదాల్లో గాయాలుగా కాగా, మూడు కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాయి. ఈ విషయం తెలుసుకున్న సోషల్ రెస్పాన్సిబులిటీ బృందం సభ్యులు శనివారం మూడు కుటుంబాలకు కలిపి రూ.15వేల నిత్యవసర సరుకులు, రూ.21వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో సోషల్ రెస్పాన్సిబులిటీ బృందం సభ్యులు శివ, రామన్న, సంజీవ్, అశోక్, వెంకట్రాముడు, నాగరాజు ఉన్నారు.

నేటి నుంచి తరగతులు ప్రారంభం

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని ఏంఏఎల్‌డీ డిగ్రీ కళాశాలలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీ మూడో, ఐదో సెమిస్టర్ విద్యార్థులకు ఆదివారం నుంచి తరగతులు ప్రారంభం కానున్నట్లు అధ్యయన కేంద్రం కో ఆర్డినేటర్ శ్రీపతినాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తరగతులకు హాజరు కావాలని పేర్కొన్నారు.

నేడు సుగుణ వర్ధంతి సభ

గద్వాల అర్బన్: విప్లవోద్యమంలో తొలితరం నాయకురాలు కామ్రేడ్ సుగుణ వర్ధంతి సభ ఆదివారం ఉదయం 10గంటలకు జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో నిర్వహించనున్నట్లు ఆమె కుటుంబ సభ్యురాలు జ్యోతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, మేధావులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

మద్యం పట్టివేత

గద్వాల క్రైం: మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ గోపాల్ తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. గట్టు మండలం ఆలూర్‌కు చెందిన కుర్వ గోవిందు తన ఇంట్లో మద్యం నిల్వ ఉంచుకుని గుట్టుగా మద్యం విక్రయిస్తున్నాడు. ఈ విషయం తెలిసిన పోలీసులు శనివారం తనిఖీ నిర్వహించి 29 లీటర్ల మద్యం సీజ్ చేసి గోవిందుపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

శాంతినగర్: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. ఎన్నికల సందర్భంగా తనిఖీ నిర్వహిస్తుండగా కొంకలకు చెందిన నాగరాజుగౌడ్ మద్యం తరలిస్తూ తనిఖీలో పట్టుబడ్డాడు. అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

దుకాణదారుల ఆందోళన

గట్టు: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద శనివారం టిప్పర్లను నిలిపేసి దుకాణదారులు ఆందోళన నిర్వహించారు. టిప్పర్ల కారణంగా బస్టాండ్ ఆవరణలో దుమ్ముధూళి లేవడంతో ఇబ్బంది పడుతున్నట్లు పేర్కొన్నారు. గట్టు ఎత్తిపోతల పథకంతో పాటుగా భారత్‌మాల రోడ్డు పనులకు ఉపయోగించే టిప్పర్లు మండల కేంద్రం నుంచి మాచర్ల వైపు వెళ్తున్న క్రమంలో దుమ్ము వల్ల అవస్థలు పడుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. రోడ్డుపై వాహనాలు నిలిచిపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. అనంతరం ట్యాంకర్‌తో రోడ్డుపై నీటిని చల్లడంతో దుకాణాదారులు ఆందోళన విరమించారు.

సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన

మానవపాడు: గ్రామీణ ప్రాంతంలోని ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని కళాజాత బృందం సభ్యులు, ఎస్ఐ రాము తెలిపారు. శనివారం మండలంలోని జల్లాపురంలో కళాజాత బృందం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మూఢనమ్మకాలు, బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేయాలన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఒక్కో సీసీ కెమెరా వందమందితో సమానంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాజాత బృందం సభ్యులు, పోలీసులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

శాంతినగర్: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు తీవ్ర గాయాలపాలైన ఘటన వడ్డేపల్లి మండలంలోని వెంకట్రామనగర్ సమీపంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కొంకల గ్రామానికి చెందిన శ్రీను, శ్రీనివాసులు, రామకృష్ణలు మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో గుడిసె శ్రీనివాసులుకు తల, కుడి చెయ్యి, కుడికాలుకు తీవ్ర గాయాలయ్యాయి. గుడిసె రామకృష్ణకు గాయాలయ్యాయి. శ్రీనుకు స్వల్ప గాయాలయ్యాయి. హుటాహుటిన వారిని చికిత్స నిమిత్తం 108లో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుల బంధువు రామయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థులు విద్యావంతులుగా ఎదగాలి

ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా



నూతన విద్యార్థుల స్వాగత కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా

గద్వాల అర్బన్: విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని ఏంఏఎల్‌డీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని మహారాణి ఆదిలక్ష్మీ దేవమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని తృతీయ సంవత్సరం విద్యార్థులు బీఏ మొదటి సంవత్సరం విద్యార్థులకు వెల్‌కం పార్టీని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ క్రమశిక్షణ, విద్యతోనే ఉత్తమ భవిష్యత్ ఉంటుందని, సమయాన్ని వృథా చేయకుండా చదివితేనే ఉన్నతంగా స్థిరపడవచ్చన్నారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీపతినాయుడు, లవీన మంజులత, అధ్యాపకులు కృష్ణమూర్తి, శ్రీనివాసులు, పవన్‌కుమార్, హరినాగభూషణం, నరేష్‌బాబు ఉన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటాలి

జాతీయ స్థాయి పోటీలో ప్రతిభ చాటాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వీరన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థి విష్ణు ఇటీవల మహబూబ్‌నగర్‌లో జరిగిన అండర్–19 రగ్బీ పోటీల్లో ప్రతిభ చాటి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా శనివారం విద్యార్థిని కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు శేఖర్, బాలకృష్ణ, గోపి, వెంకటేష్, పవన్‌కుమార్, కలీముల్లా, రేణుక ఉన్నారు.



విద్యార్థిని సన్మానిస్తున్న అధ్యాపకులు

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి



క్యాతూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం

అలంపూర్ రూరల్: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తాయని ఎమ్మెల్యే వీఎం అబ్రహం అన్నారు. మండలంలోని క్యాతూర్‌లో శనివారం ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. క్యాతూర్ ప్రజలు ఎమ్మెల్యేకు నీరాజనం పట్టారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అల్లబకాష్, బీఆర్ఎస్ నాయకులు ఇస్మాయిల్, గోకారి, నర్సన్ గౌడ్, క్యాతూర్ శేఖర్‌రెడ్డి, బాబు కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ముమ్మురంగా బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

ధరూరు: నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో ఆయా పార్టీల నేతలు ఇంటింటి ప్రచారాన్ని ముమ్మరం చేశారు. శనివారం మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తరపున శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు.కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు డీఆర్ విజయ్ కుమార్, ఎంపీటీసీ దౌలన్న, బీఆర్ఎస్ నాయకులు రాజారెడ్డి, వెంకటేష్ నాయుడు, అబ్రహం, విక్రంసింహారెడ్డి, కర్వ శ్రీను, రాములు, వెంకటన్న, కర్రెన్న, ఎర్రన్న పాల్గొన్నారు.

కేటీదొడ్డి: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఉరుకుందు, సీనియర్ నాయకులు గోపి తెలిపారు. మండల కేంద్రంలోని వెంకటాపురం, వివిధ గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గోవిందు, హనుమంతు, తదితరులు ఉన్నారు.



ధరూరులో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ధరూరు: మండలంలోని ర్యాలంపాడు, ఓబులోనిపల్లి గ్రామాల్లో మండల వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, సర్పంచులు కర్రెమ్మ, పరశురాంలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ నెల 6న గద్వాలలో జరిగే ప్రజా ఆశీర్వాద సభకు కార్యకర్తలు, నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. ఈ సందర్భంగా సభకు సంబంధించిన వాల్ పోస్టర్లను, కర పత్రాలను పంపిణీ చేశారు.

కేసీఆర్ మాటలు నమ్మకండి

కాంగ్రెస్ అభ్యర్థి సరిత



ద్యాగదొడ్డిలో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి సరిత

ధరూరు: మాటల గారడీతో మరోసారి ప్రజలను మోసం చేసేందుకు సీఎం కేసీఆర్ ప్రయత్నిస్తున్నారని, కేసీఆర్ ప్రకటించిన మేనిఫెస్టో అంతా అబద్ధమని, పదేళ్లుగా చేయని పనులు ఇప్పుడు చేస్తామంటే ఎలా నమ్ముతామని జెడ్పీచైర్‌పర్సన్, కాంగ్రెస్ అభ్యర్థి సరిత అన్నారు. శనివారం మండల పరిధిలోని మాల్‌దొడ్డి, ద్యాగదొడ్డి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ఈనెల 30న నిర్వహించే ఎన్నికల్లో చేతిగుర్తుకు ఓటు వేయాలని ఆమె కోరారు. కేసీఆర్‌లాగా ఇచ్చిన మాట తప్పడం కాంగ్రెస్ చరిత్రలో లేదన్నారు. దొరలు, పెత్తందార్ల పాలనకు చరమగీతం పాడాలని, బడుగు బలహీన వర్గాల నుంచి తనకు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్ పర్సన్ బండ్ల లక్ష్మీదేవి, మధుసూదన్‌బాబు, లత్తీపురం వెంకట్రామిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ కర్రెన్న, నాయకులు జాకీర్, శ్రీకాంత్‌రెడ్డి, ఆనంద్‌గౌడ్, పరమేష్, రంగస్వామి, సిద్దయ్య, నల్లారెడ్డి, పోస్టు వెంకటయ్య, నర్సింహులు, పల్లెన్న, సత్యన్న పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యాలయం ప్రారంభం..

ఎన్నికలు దగ్గరపడుతున్న తరుణంలో ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని జెడ్పీ చైర్ పర్సన్, కాంగ్రెస్ అభ్యర్థి సరిత, సీనియర్ న్యాయవాది మధుసూదన్‌బాబులు పేర్కొన్నారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, జాకీర్, నరేందర్‌రెడ్డి, బోయ శ్రీను, ఈశ్వరయ్య, కర్రెన్న, సవారన్న పాల్గొన్నారు.

గొర్రెలు, మేకలకు పీపీఆర్ టీకాలు

అయిజ: గొర్రెలకు, మేకలకు పారుడు రోగం రాకుండా ఉండేందుకు మండలంలోని వివిధ గ్రామాల్లో వెటర్నరీ సిబ్బంది టీకాలు వేసే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. శనివారం మండలంలోని రాజాపురం, ఎక్లాస్ గ్రామాల్లో వెటర్నరీ సిబ్బంది గొర్రెలకు, మేకలకు టీకాలు వేశారు. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపారాణి టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. మొత్తం 1,640 గొర్రెలకు, 114 మేకలకు టీకాలు వేసినట్లు ఆమె తెలిపారు.

బీఎస్పీ ఎన్నికల ప్రచారం

శాంతినగర్: వడ్డేపల్లి మండలం బుడమొర్సు, మున్సిపాలిటీ పరిధిలోని పైపాడులో శనివారం సాయంత్రం బీఎస్పీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఏనుగు గుర్తుకు ఓటేయాలని ప్రజలను కోరారు.

గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్

మానవపాడు: మండలంలోని కొర్విపాడు, చంద్రశేఖర్‌నగర్, శ్రీనగర్ గ్రామాల్లో శనివారం సీఐ శివశంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో గొడవలు పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సూచించారు.

బీచుపల్లిలో మాజీ మంత్రి పూజలు

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయాన్ని శనివారం మాజీ మంత్రి డీకే అరుణ సందర్శించారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆమె వెంట బీజేపీ నాయకులు, ఆలయ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

శాంతినగర్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని స్టేషన్‌కు తరలించిన సంఘటన వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ నరేష్ వివరాల ప్రకారం.. మద్దూరు స్టేజీ, పైపాడు స్టేజీ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇసుక ట్రాక్టర్ల డ్రైవర్లు ట్రాక్టర్లను వదిలి పారిపోయారు. అక్కడే పంచనామా నిర్వహించి రెండు ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కాల్వలోకి దూకిన మహిళ

గద్వాల క్రైం: గుర్తుతెలియని మహిళ (32) శనివారం రాత్రి గద్వాల హౌసింగ్‌బోర్డు సమీపంలోని జూరాల కుడి కాల్వలోకి దూకింది. బురక ధరించిన మహిళ కాల్వలోకి దూకే క్రమంలో కేకలు వేయగా, గమనించిన కొందరు కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. దీంతో పోలీస్, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి పోలీస్, ఫైర్ సిబ్బంది చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. నీటిపారుదల అధికారులతో మాట్లాడి నీటిని నిలుపుదల చేశారు. కాల్వ వద్దకు గుర్తుతెలియని వ్యక్తితో సదరు మహిళ బైక్‌పై వచ్చినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. మహిళతో వచ్చిన వ్యక్తి ఎవరనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

బహుజన నాయకుడికి అవకాశం ఇవ్వండి



ఉమిత్యాలలో ప్రచారం నిర్వహిస్తున్న గొంగళ్ల రంజిత్‌కుమార్

కేటీదొడ్డి: బహుజనులకు రాజ్యాధికారం దక్కాలని, ఓటర్లు తమ ఓటుతో రాజ్యాధికారం కట్టబెట్టాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ ఎఐఎఫ్‌బీ ఎమ్మెల్యే అభ్యర్థి గొంగళ్ల రంజిత్‌కుమార్ అన్నారు. ఎన్నికల ప్రజాచైతన్య యాత్రలో భాగంగా శనివారం కేటీదొడ్డి మండలంలోని ఉమిత్యాల, ఉమిత్యాలతండాలో పర్యటించి మాట్లాడారు. గద్వాల కోటపై బహుజన జెండాను ఎగురవేయడానికి ప్రతి ఒక్కరు కృషి చేసి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ధరూరు: స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి అగ్రవర్ణాల వారే ఎక్కువ సార్లు గద్వాల గడ్డపై రాజ్యమేలారని, బహుజన నాయకుడికి ఒక్క అవకాశం ఇచ్చి గద్వాల కోటపై బహుజన జెండా ఎగరవేసేందుకు సహకరించాలని గొంగళ్ల రంజిత్ కుమార్ సతీమణి గొంగళ్ల సాహితి అన్నారు. శనివారం ఆమె మండల నాయకులతో కలిసి మండలంలోని కోతులగిద్దలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజల పక్షాన పోరాడుతున్న నాయకుడికి అవకాశం ఇస్తే ప్రజా సమస్యలను తీరుతాయన్నారు. కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా మహిళా నాయకురాలు రేణుక యాదవ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ గూటికి గౌతంరెడ్డి

అయిజ: దివంగత బీఆర్ఎస్ నాయకుడు ఉత్తనూరు తిరుమలరెడ్డి తనయుడు గౌతంరెడ్డి బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ గూటికి చేరారు. దివంగతులైన బీఆర్ఎస్ నాయకుడు ఉత్తనూరు తిరుమలరెడ్డి సతీమణి ప్రస్తుతం అలంపూర్ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. ఆమె కుమారుడు గౌతంరెడ్డి శుక్రవారం రాత్రి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.



రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన గౌతం రెడ్డి

ఇంటింటి ప్రచారంలో విజయుడు

అలంపూర్ రూరల్: అలంపూర్ అసెంబ్లీ టికెట్ ఆశిస్తున్న విజేయుడు మండలంలోని గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. క్యాతూర్, బీమవరం, ఉట్కూర్, కోనేరు గ్రామాల్లో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి బలపరుస్తున్న అభ్యర్థిగా విజేయుడు ప్రచారం చేస్తున్నారు. అముల్యామైన ఓటును తనకే వేయాలని వృద్ధురాలిని కోరారు. ఆయన వెంట టెంపుల్ చైర్మన్ చిన్న కృష్ణయ్య, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.



వృద్ధురాలిని ఓటు కోరుతున్న విజేయుడు

విశ్వరూప మహాసభను జయప్రదం చేయండి



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

గద్వాల అర్బన్: ఈనెల11న హైదరాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించే మాదిగ ఉపకులాల విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ పోగుల రాజేష్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో సభకు సంబంధించిన కరపత్రాలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభకు అధిక సంఖ్యలో తరలొచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు గంజిపేట పరశురామ్, ఇమ్మానియేల్, ఆంజనేయులు, తిమ్మప్ప, ఏసన్న, దేవరాజు, కోళ్ల మహేష్ ఉన్నారు.

ప్రజా ఆశీర్వాద సభను జయప్రదం చేద్దాం

గద్వాల అర్బన్: అన్ని వర్గాల ప్రజలతో ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 3గంటలకు జిల్లా కేంద్రంలో చింతలపేటలోని ప్యారడైజ్ ఫంక్షన్ హాల్లో ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించనున్నట్లు ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు మున్నాబాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభకు ఎంఐఎం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కో ఆర్డినేటర్ జాబీర్ బిన్ సయ్యద్, ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి కృష్ణమోహన్‌రెడ్డి హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు, బీఆర్ఎస్, ఎంఐఎం నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

శాంతినగర్: సీఎం కేసీఆర్ గద్వాలలో చేపడుతున్న ప్రజా ఆశీర్వాద సభను జయప్రదం చేద్దామని బీఆర్ఎస్వీ పాలమూరు యూనివర్సిటీ కన్వీనర్ గద్దం భరత్‌బాబు అన్నారు. మున్సిపాలిటీ కేంద్రంలో శనివారం ఆయన విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. గద్వాలలో ప్రజా ఆశీర్వాద సభకు ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. జిల్లాలోని విద్యార్థి విభాగం నాయకులు తరలిరావాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్వీ నాయకులు రాజు, యుగేంధర్, ఏసు, రాజు, సచిన్, అశోక్‌లు పాల్గొన్నారు.

ఇటిక్యాలలో కాంగ్రెస్ ప్రచారం

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండల కేంద్రంలో శనివారం మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ సతీమణి మహాలక్ష్మి కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తుందన్నారు. ఇంటి స్థలం ఉన్నవారికి ఇల్లు కట్టుకోవడానికి రూ. 5లక్షల రూపాయలు, రైతులకు, కౌలు రైతులకు ఎకరాకు రూ.7500 చొప్పున రెండు విడతలుగా రూ.15,000 అందిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ హస్తం గుర్తుకు ఓటేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇటిక్యాలలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే సతీమణి

బాధ్యతగా పని చేయాలి

గద్వాల క్రైం: వైద్య ఆరోగ్యశాఖలో విధులు నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని జిల్లా ఇన్‌చార్జ్ వైద్యాధికారిణి శశికళ అన్నారు. శనివారం సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రసవలు సైతం అక్కడే జరిగేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. అత్యవసర సమయాల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మౌలిక వసతులు, సదుపాయాల కొరత ఉంటే నివేదికలు ఇవ్వాలన్నారు. సీజనల్ వ్యాధుల నివారణకు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కింది స్థాయి సిబ్బంది నిరంతరం ప్రజల్లో ఉంటూ ఆరోగ్య సమస్యలపై చైతన్యం తీసుకురావాలన్నారు. పలు అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో వైద్యులు, సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జ్ వైద్యాధికారిణి

ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు



వెండిని వితరణ చేస్తున్న భక్తులు

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ప్రధాన దేవాలయాల్లో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్దకల్‌లో స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి, సద్దలోనిపల్లి కృష్ణస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్ప, శేషంపల్లి శివసీతారామస్వామి, చర్లగార్లపాడు వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు అరవిందరావు, చంద్రశేఖర్‌రావు, నాయకులు తిమ్మారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, సీతారామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, బాబురావు ఉన్నారు.


ఆదిశిలా వాసుడికి వెండి వితరణ

స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి వారికి భక్తులు వెండి వితరణ చేశారు. రాయచూర్‌కు చెందిన గోపాలాచారి కుమారులు అనురాగ్, దుర్గప్రసాద్‌లు స్వామి వారికి 995 గ్రాముల వెండిని వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మధుసూదనాచారి, రవిచారి దాతలకు పూలమాల, శేషవస్త్రంతో సత్కరించారు.

ఇద్దరు నిందితుల అరెస్ట్

ఎర్రవల్లిచౌరస్తా: దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని శనివారం రిమాండ్‌కు తరలించినట్లు ఇటిక్యాల ఎస్ఐ అశోక్‌బాబు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు..మల్దకల్ మండల కేంద్రానికి చెందిన మొండి జయన్న (మొండి బంగారం), అనంతపురం జిల్లాలోని కొడమాలపల్లికి చెందిన పొంతగిరి నాగార్జున ఇద్దరు కలిసి మద్యానికి బానిసలయ్యారు. జల్సాలకు డబ్బు లేకపోవడంతో గుళ్లలో దొంగతనాలకు పాల్పడేవారు. ఈ క్రమంలో శనివారం ఉదయం ఇటిక్యాల పోలీసులు ఎర్రవల్లి కూడలిలో తనిఖీ చేస్తుండగా ఇద్దరు ద్విచక్ర వాహనంపై అనుమానంగా కనిపించారు. వెంటనే పోలీసులు వారిద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 45 తులాల వెండి కిరీటం, 2తులాల వెంగి కళ్లు, మీసాలు, 2గ్రాముల బంగారు ముక్కుపుడుకలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వారిపై గతంలో జిల్లాలోని అనేక పీఎస్‌లలో పలు కేసులు ఉన్న ట్లు తెలిపారు. అనంతరం నిందితులను కోర్టులో హాజరుపర్చి జడ్జి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. కేసును ఛేదించడంతో ఉత్తమ ప్రతిభను కనబర్చిన పోలీస్ అధికారులను, ఇటిక్యాల పోలీస్ సిబ్బందిని, సీసీటీవీ, ఐటీకోర్ పోలీసులను ఎస్పీ అభినందించారు.

బీఎస్పీ అసెంబ్లీ అభ్యర్థిగా కేశవరావు



మాకుల చెన్న కేశవరావు

అలంపూర్: అలంపూర్ నియోజకవర్గంలో అసెంబ్లీ అభ్యర్థుల ఉత్కంఠ కొనసాగుతోంది. ప్రధాన పార్టీల్లో కాంగ్రెస్ అభ్యర్థి మినహా అన్ని ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థుల కసరత్తు నామినేషన్ల పర్వం ఆరంభమైన పూర్తి కాలేదు. ప్రస్తుతం బీఎస్పీ అభ్యర్థి ప్రకటనతో ఉత్కంఠకు తెరపడింది. బీఎస్పీ చీఫ్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సొంత నియోజకవర్గం కావడంతో బీఎస్పీలోనూ ఈ ఉత్కంఠ కొనసాగింది. అలంపూర్ నియోజకవర్గంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న ఎంసీ కేశవరావును అభ్యర్థిగా ప్రకటించారు.

అభ్యర్థి పేరు : మాకుల చెన్న కేశవరావు **తండ్రి :** ఎం చెన్నప్ప
తల్లి : నాగమ్మ (మాజీ సర్పంచ్) **పుట్టిన తేదీ :** 08–06–1967
విద్యాభ్యాసం : ఎస్ఎస్‌సీ **స్వగ్రామం :** పుల్లూరు, ఉండవెల్లి మండలం, జోగులాంబ గద్వాల జిల్లా
రాజకీయ అనుభవం : విద్యాభ్యాసం సమయంలోనే ఎస్ఎఫ్ఐలో క్రియాశీల రాజకీయాలు. కాంగ్రెస్ పార్టీ పని చేసిన అనుభవం. 2009 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీలో క్రియాశీలకంగా వ్యవహరించిన అనుభవం. 2013లో బీఎస్పీలో సభ్యత్వం. ప్రస్తుతం బీఎస్పీ జిల్లా అధ్యక్షుడిగా గుర్తింపు
కుటుంబం : భార్య సుదక్షణ, ముగ్గురు కుమార్తెలు ఎం సుమేధ, ఎం చందన, ఎం సుప్రియ
హాబీ : సేవా కార్యక్రమాలు, స్వేరోస్ ద్వారా విద్యార్థులకు చేయూత
స్ఫూర్తి : రాజకీయాల్లోకి రావడానికి ప్రధాన స్ఫూర్తి బీఎస్పీ వ్యవస్థాపకులు కాన్షీరాం. డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్